క్లుప్తంగా

పొలంబాటకు మహర్దశ



శావల్యాపురం: వేల్పూరు, కారుమంచి గ్రామాల్లో పొలాలకు లింకు రోడ్ల మరమ్మతుల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు పనులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఇరువురి సహకారంతో గత కొన్ని సంవత్సరాల నుంచి నెలకొనియున్న సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. వేల్పూరు గ్రామ పంచాయతీలో 10 కిలో మీటర్ల మేర పనులు తుది దశకు చేరినట్లు చెప్పారు. మండలంలోని కారుమంచి గ్రా మం ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక నుంచి పొలాలకు వెళ్లే రహదారి పనులు 3 కిలోమీటర్ల మేర జెడ్పీ, మండల నిధులతో జరుగుతున్నాయన్నారు.

రహదారి దాటుతూ మహిళ దుర్మరణం



చిలకలూరిపేట: రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం నాయకుడు కందుల శ్రీకాంత్ మాతృమూర్తి కందుల లక్ష్మి (55) మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బయ్యతోటలో నివాసం ఉండే కందుల శ్రీలక్ష్మి ప్రతిరోజూ ఉదయాన్నే పండరీపురంలోని ఓ మెడిటేషన్ సెంటర్‌కు వెళతారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయాన్నే మెడిటేషన్ సెంటర్‌కు వెళ్లేందుకు విజయా బ్యాంకు సెంటర్‌లో జాతీయ రహదారి దాటుతున్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలు వైపు నుంచి వస్తున్న తమిళనాడుకు చెందిన కంటైనర్ లారీ ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం స్వగృహానికి తరలించారు. మృతురాలికి భర్త శ్రీనివాసరావు, ముగ్గురు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఫోన్‌లో కందుల శ్రీకాంత్‌కు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు కాట్రగడ్డ మస్తాన్ రావు, వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, పఠాన్ తలహాఖాన్ తదితరులు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

చిలకలూరిపేటటౌన్: 14 సంవత్సరాలు దాటని బాలలు తప్పనిసరిగా పాఠశాలలో చదువుకోవాలని వేద పాఠశాల డైరెక్టర్ గిరి పెర్సీ సర్వోప చెప్పారు. సోమవారం పట్టణంలోని వేద పాఠశాలలో బాలకార్మికుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ నేటి బాలలే రేపటి భావిభారత నిర్మాతలని చెప్పారు. బాలల తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పని సరిగా చదివించాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి భారత ప్రభుత్వం బాలకార్మిక చట్టం చేసిందని తెలిపారు. ముందుగా బాలకార్మిక చట్టాలపై విద్యార్థులు ప్లకార్డు ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ సత్యదీప్తి, ప్రిన్సిపాల్ డి వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ స్టాంపులకు కొరత

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో రిజిస్ట్రేషన్ స్టాంపులకు కొరత ఏర్పడింది. దీనిని అవకాశంగా తీసుకున్న డాక్యుమెంటర్ రైటర్లు, స్టాంపు విక్రయదారులు కక్షిదార్ల వద్ద నుంచి అధిక ధరలు వసూలుచేస్తున్నారు. గత పదిరోజుల నుంచి ఉన్న ఈ సమస్య కొనసాగుతుంది. పది రూపాయల స్టాంపు పత్రం రూ.30లు నుంచి రూ.40లకు విక్రయిస్తున్నారు. రూ.50లు, రూ.100లు పత్రాలు దొరకటంలేదని కక్షిదార్లు వెల్లడిస్తున్నారు. కొంతమంది తమ వద్ద నున్న వందరూపాయల స్టాంపు పత్రం రూ.300లకు విక్రయిస్తున్నారు. వినియోగదారులకు ఇ-స్టాంపును అలవాటు చేసేందుకు ప్రతి రిజిస్ట్రేషన్‌లో ఎంతో కొంత ఇ- స్టాంపు ద్వారా దరఖాస్తు చేయాలని ఉత్తర్వులు ఇచ్చినట్లుగా కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు వెల్లడిస్తున్నారు.

ఆరంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండరోడ్డు శ్రీనివాసనగర్‌లో వేంచేసియున్న శ్రీగోదా పద్మావతీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 12వ మహా కంభాభిషేక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధ్వజస్తంభంపై అర్చక స్వాములు సోమవారం గరుడ పతాకాన్ని ఎగురవేసి బ్రహ్మాది దేవతలను శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలికారు. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజాధికాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి మల్లిపెద్ది సాంబశివరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఎలాంటి విద్యుత్ కోతలు లేవు

చిలకలూరిపేట: నియోజకవర్గ పరిధిలో ఎలాంటి విద్యుత్ కోతలు లేవని విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. వాతావరణ మార్పుల దృష్ట్యా శని, ఆదివారాల్లో ఉరుములు, మెరుపులు, గాలి దుమారం కారణంగా విద్యుత్ తీగలు తెగుట, విద్యుత్ స్తంభాలు విరగి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అక్కడక్కడా అంతరాయం ఏర్పడిందని తెలిపారు. వా ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే ఏఈఈలను సంప్రదించాలని కోరారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



వెల్లటూరులో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు



జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు బత్తుల



రొంపిచర్లలో విద్యార్థినికి కిట్స్ అందజేస్తున్న ఎంపీపీ బాలనాగమ్మ



పసుమర్రులో విద్యాకానుక పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ జాలాది సుబ్బారావు



జగనన్న విద్యాకానుకలతో అన్నవరం విద్యార్థులు

బొల్లాపల్లి: పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. సోమవారం తొలి రోజునే అన్ని పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశామని ఇన్‌చార్జి ఎంఈవో వి. ఏసుబాబు తెలిపారు. మండలంలో 79 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 6890 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వీరందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. మండలంలోని బొల్లాపల్లి, వెల్లటూరు జిల్లాపరిషత్ హైస్కూల్స్, తదితర పాఠశాలల్లో జె.వి.కె.కిట్లు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు కె.అపర్ణ, కె.పార్వతిలు, తల్లిదండ్రుల కమిటీల చైర్మన్లు ఎం.కోటేశ్వరరావు, గురున్నాథం, వెల్లటూరు గ్రామ సర్పంచ్ ఎం.చిన్నవీరయ్య, ఎంపీటీసీ జి.చిన్నవెంకయ్య, చేతుల మీదుగా విద్యార్థులకు జె.వి.కె.కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురున్నాథం, ఖజ్జాయం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమానత్వం

నరసరావుపేట రూరల్: విద్య ద్వారానే సమానత్వం సాధించవచ్చని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. మండలంలోని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. పాఠశాల ఆధునీకరణ, మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్న భోజనం, విద్యాకానుక కిట్లతో తల్లిదండ్రులపై ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడి బయట ఉన్న బాలకార్మికులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో జ్యోతికిరణ్, ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, విద్యాకమిటి చైర్మన్ పి.కాశిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గణపవరం హైస్కూలులో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న పీఎంసీ చైర్మన్ శంకరరెడ్డి

రొంపిచర్లలో...

రొంపిచర్ల: ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అన్నారు. వేసవి సెలవులు అనంతరం సోమవారం మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్స్ పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తవనం రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాదెండ్లలో 5996 మందికి...

నాదెండ్ల: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు సోమవారం పునః ప్రారంభమయ్యాయి. ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ క్లాసులు జరిగాయి. తొలిరోజు 50 శాతం మంది మాత్రమే విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజే ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, పీఎంసీ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి తొలి విడత 5996 మందికి కిట్లు రాగా, వాటిని పంపిణీ చేశారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, వైస్ చైర్మన్ రసూల్‌బీ, హెచ్‌ఎం కృష్ణానాయక్, ఉపాధ్యాయులతో కలిసి కిట్లు పంపిణీ చేశారు. చిరుమామిళ్ళ కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలలో నాదెండ్ల మాజీ సొసైటీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు కిట్లు పంపిణీ చేశారు.

పసుమర్రులో...

చిలకలూరిపేటటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తుందని 15 వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు చెప్పారు. సోమవారం మండలంలో పసుమర్రు గ్రామంలో మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుకను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఇంగ్లిషు మీడియంలో విద్యా బోధన జరుగుతుందని, జగనన్న విద్యాకానుకలో భాగంగా ఉచిత పాఠ్యపుస్తకాలు, వర్కుబుక్స్, మూడు జతల యూనిఫాం, ఇంగ్లిషు డిక్షనరీ, స్కూల్ బ్యాగ్, షూస్, సాక్స్ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 16 వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, హెచ్‌ఎం షేక్ మొహమ్మద్ యాసిన్, మీరావలి, గద్దె హరిబాబు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో ఉన్న మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ హైస్కూల్ లో విద్యాకానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఈవో కె.లక్ష్మి పాల్గొని విద్యాకానుక పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.సుధా, పోటు శ్రీనివాసరావు, ఎ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



వినుకొండలో జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులకు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

శావల్యాపురంలో...

శావల్యాపురం: జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పాఠశాలలు పునఃప్రారంభం రోజున విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డుపాటి విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముట్లూరి ప్రసాదు, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, మాజీ ఎంపీటీసీ చిట్టేటి రవి, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు కావూరి మాబు సుభానయ్య, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, రాగుల రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

బడిగంటలు మోగిన వేళ..!



వినుకొండ ఫస్ట్ వార్డు పాఠశాలకు వస్తున్న విద్యార్థినులు



వినుకొండలో తరగతులకు హాజరైన విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థినీ విద్యార్థులు పాఠశాలలకు తరలివచ్చారు. తొలి రోజున పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలతో పాటు పలు పాఠశాలల్లో విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. తొలి రోజు కూడా మెనూ ప్రకారం రాగి జావా, మధ్యాహ్నం అందజేశారు.

ఉత్సాహంగా చేరిన విద్యార్థులు

యడ్లపాడు: 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. ఇప్పటికే మనబడి నాడు-నేడు పనులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని వసతులతో సిద్ధమైన పాఠశాలలకు విద్యార్థులు ఆనందంగా తరలి వచ్చారు. దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో పాఠశాలల పునః ప్రారంభం రోజునే ఏకకాలంలో జగనన్న విద్యాకిట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేయడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఆయా పాఠశాలల్లో ఎస్‌ఎం కమిటీ సభ్యులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అర్హత, అనుభవం గల ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యబోధనతో పాటు పాఠ్య, రాత పుస్తకాలు, జగనన్న విద్యాకానుక కింద యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు, సాక్సులు, డిక్షనరీలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని 51 ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన 4,458 మంది విద్యార్థులకు తొలి రోజునే 25,271 రాత, 35,406 పాఠ్యపుస్తకాలు, 4458 యూనిఫాం, 4380 మందికి బూట్లు, 3263 బెల్టుల్ని అందజేసినట్లు ఎంఈవో ఐ ఆంజనేయులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మైదవోలు ప్రాథమిక పాఠశాలలో కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రతిపక్షాల కుట్రలను ప్రజలే తిప్పికొడతారు

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితోనే కలసి సాగుతామంటున్న జనం
- అభివృద్ధి, సంక్షేమంతో అన్ని వర్గాల్లో సంతోషం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనపై ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలే తిప్పికొట్టి మరోదఫా వైఎస్సార్ సీపీని దీవించేందుకు సిద్ధంగా ఉన్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. సంకురాత్రిపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం తొలి రోజు నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలౌతున్న తీరును ప్రజలతో ముచ్చటిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముగింట్లోకి తెచ్చారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అన్ని పథకాలను ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన చేశారన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో అన్ని పదవుల్లో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, విద్యావసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహనమిత్ర, లానేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుతో అన్ని వర్గాల్లో సంతోషాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణయుగం ఆవిష్కృతమైందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు వైఎస్సార్ సామాజిక భద్రతా పించన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి నాగమణి, ఉపసర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ తలతోటి రాణి, మండల ఉపాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, నాదెండ్ల, గణపవరం సొసైటీ చైర్మన్లు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, పార్టీ నాయకులు మద్దూరి కోటిరెడ్డి, జెట్టి బొల్లయ్య, వీరాస్వామి, బత్తుల చిన వెంకటేశ్వర్లు, వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు తప్పెట క్రీస్తురాజు, కుమార్, శ్రీను, మేడిశెట్టి శ్రీను, ఆరేటి పాపారావు, మండల నాయకులు వెంకటేశ్వర్లు, గద్దె కోటయ్య, కోటిరెడ్డి, అల్లడి రవికుమార్, పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, రత్తయ, జెట్టి లక్ష్మీనారాయణ, పత్తి వెంకట్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు

ఎమ్మెల్యే బొల్లా విమర్శ



వినుకొండ(నూజెండ్ల): ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కర్నాటక, వైఎస్సార్ మేనిఫెస్టోను కాపీ కొట్టి మరోమారు ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పేరు గుర్తుకు వచ్చేది వెన్నుపోటు తప్ప ఏఒక్క పథకమూ గుర్తుకు రాదన్నారు. అలాగే పవన్ కళ్యాణ్‌కు కూడా వెన్నుపోటు తప్పదని జాగ్రత్తగా ఉండాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు అన్నీపార్టీలతో పొత్తు పెట్టుకుని విడిపోయిన తరువాత వారిని విమర్శించడం చంద్రబాబు నైజమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమ లు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించేందకు ఎంతో దోహదం చేస్తున్నాయన్నారు. ఇచ్చిన హామీలు అమలు యేయలేని చంద్రబాబుకు ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రికి తేడా ఏమిటో ప్రజలకు బాగా తెలుసునని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని ఎమ్మెల్యే బొల్లా చురకలు అంటించారు. నోరు ఉంది కదాఅని ఎలా పడితే అలామాట్లాడితే ప్రజలు నమ్మే స్థితిలో లేర్నారు. నకిలీ కంపెనీలు స్థాపించి రైతులను నట్టేట ముంచించింది మీరు కాదా అని ప్రశ్నించారు.

తప్పనిసరిగా కౌలురైతు కార్డు తీసుకోవాలి



కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో అప్పారావు

ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి, ఇనిమెళ్ల గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో కౌలు రైతులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు పాల్గొని మాట్లాడుతూ కౌలుకు భూమిని సాగు చేసే ప్రతి ఒక్క రైతు కూడా కౌలు రైతు కార్డులు పొందాలని, కౌలురైతు కార్డుల ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతాయన్నారు. భూయజమానులు కౌలుదారులకు కౌలు కార్డు తీసుకోవడానికి సహకరించాలని, తద్వారా కౌలు రైతుకు పంటల బీమా, పంట రుణం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, ఏదైనా విపత్తులో పంట నష్టపరిహారం పొందవచ్చన్నారు. యజమానులకు భూహక్కుకి ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సొంత పొలం లేని వారు కౌలు కార్డు ద్వారా రైతు భరోసా సాయం కూడా పొందవచ్చన్నారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు లైసెన్స్ ఉన్న డీలర్ దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదును తీసుకొని జాగ్రత్తగా పంట కాలం పూర్తయ్యే వరకు దాచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.కె.యు. సల్మా, గ్రామ ఉద్యాన సహాయకులు పి. ఏలియా, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారని జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కేంద్ర ఎన్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్న జి-20 జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా సోమవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్య అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన చదువుతో పాటు జాబ్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్‌ను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ఉన్నత అవకాశాలను ఒడిసి పట్టాలంటే నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం



ధ్వంసమైన సిమెంటు రేకుల పైకప్పు గది

చిలకలూరిపేట: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా వంట గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. బాధితులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ సుబ్రమణ్యం, ఆంజనేయులు సోదరులు పట్టణంలోని సూదావారిపాలెంలో తమతమ కుటంబాలతో కలసి నివాసం ఉంటారు. పై పోర్షన్‌లో సుబ్రమణ్యం, కింది పోర్షన్‌లో ఆంజనేయులు కుటుంబ సభ్యులు ఉంటారు. తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో విద్యుత్ పోవడంతో పై ఇంటిలో నిద్రిస్తున్న సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు ఐదుగురు, కింది ఇంటిలో ఉండే ఐదుగురు మొత్తం ఇంటి నుంచి బయటకు వచ్చి ఆరు బయట మంచాలు వేసుకొని పడుకున్నారు. నాలుగున్నర సమయంలో విద్యుత్ ఒకసారి వచ్చిన క్రమంలో పై ఇంటిలో షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం ఏర్పడింది. కింది పోర్షన్‌లో సిమెంట్ రేకుల కప్పు ఉన్న గది ధ్వంసమైంది. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదంపాల్

నరసరావుపేట టౌన్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదంపాల్ అన్నారు. జాతీయ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కోర్టు ప్రాంగణంలో అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ విద్యనందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. బడిఈడు పిల్లలను ఎవరైనా పనులలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.